సాక్షి
రంగారెడ్డి
సోమవారం, 14, అక్టోబర్, 2024



చేవెళ్ల: దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఆమనగల్లు: రావణ దహనం



మీర్‌పేట: జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో రావణ దహనానికి హాజరైన భక్తులు

దసరా సందడి

దసరా సంబరాలు జిల్లాలో అంబరాన్నంటాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రజలు శనివారం ఆనందోత్సాహాల మధ్య వేడుకను జరుపుకొన్నారు. కొత్త దుస్తులు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా జమ్మిచెట్ల వద్దకు చేరుకుని పూజలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం పాలపిట్ట దర్శనం చేసుకుని పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి రావణ దహనం చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాతలను నిమజ్జనానికి తరలించారు. ఎక్కడ చూసినా పల్లెలన్నీ సందడిగా కళకళలాడుతూ కనిపించాయి.

న్యూస్‌రీల్

చిలుకూరు సన్నిధిలో మేఘాలయ గవర్నర్



మొయినాబాద్: మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్ చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. శనివారం దసరా పండుగ రోజు చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకుడు రంగరాజన్ స్వాగతం పలికారు. గవర్నర్ ఆలయ గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయ విశిష్టతను అర్చకుడు రంగరాజన్ ఆయనకు వివరించారు. స్వామివారి వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు.

పండుగ ముగిసింది.. రద్దీ పెరిగింది



షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

షాద్‌నగర్: దసరా పండుగ ముగియడంతో పల్లెలకు వచ్చిన వారంతా పట్నానికి తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ – బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి చాలామంది స్వగ్రామాలకు వెళ్లారు. మళ్లీ అందరూ సిటీ బాట పట్టడంతో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ట్రాఫిక్ రద్దీ పెరిగింది. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద భారీగా వాహనాలు క్యూ కట్టాయి.

బతుకమ్మ వేడుకల్లో డీజే

మేయర్ సహా మరో ఇద్దరిపై కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని ఎన్బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో నిబంధనలకు విరుద్ధంగా డీజే ఏర్పాటు చేయడంతో పాటు గడువు ముగిసిన తర్వాత కూడా సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడిన ఘటనలో నగర మేయర్‌తో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని ఎన్బీటీనగర్‌లో అమ్మవారి విగ్రహాల నిమజ్జన ఊరేగింపుతో పాటు మండపాలను కానిస్టేబుళ్లు ఎస్కే నజీర్ అహ్మద్, హోంగార్డు సాయి ప్రసాద్‌లు పర్యవేక్షిస్తున్నారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ముందు జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో భారీ సౌండ్‌తో డీజే ఏర్పాటు చేశారని, శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో నజీర్ అహ్మద్, సాయిప్రసాద్‌లు అక్కడికి చేరుకుని డీజేను ఆపాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అక్కడికి చేరుకుని పోలీసులు ఇందులో జోక్యం చేసుకోవద్దని, మ్యూజిక్‌ను కొనసాగించాలని వారికి సూచించారు. భారీ శబ్ద కాలుష్యంతో ఈవెంట్‌ను అలాగే కొనసాగించారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కానిస్టేబుల్ నజీర్ అహ్మద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బతుకమ్మ వేడుకల నిర్వాహకులు కందాడి విజయ్‌కుమార్, మ్యూజిక్ ప్లే చేస్తున్న మహ్మద్ గౌస్, జోక్యం చేసుకోవద్దంటూ చెప్పిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 223, 280, 292, 49 రెడ్‌విత్ 3 (5), సెక్షన్ 21/76 సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెగ తాగేశారు

దసరా పండుగ వేళ మద్యం కిక్కు

- రూ.312 కోట్లకు పైగా విక్రయాలు
- సర్కారు ఖజానాకు భారీగా రాబడి
- గత ఏడాదితో పోలిస్తే కొంత తగ్గుముఖం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దసరా పండుగ వేళ మద్యం 'కిక్కు' పెంచింది. హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో విక్రయాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో (పది రోజుల్లో) అమ్మకాలు కొంత తగ్గుముఖం పట్టాయి. రియల్ ఎస్టేట్ పడిపోవడం, మూసీ ముంపు బాధితుల్లో దసరా సంబురాలు తగ్గాయి. హైడ్రా కూల్చివేతలతో మెజారిటీ అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు, ఖాళీ స్థలాల అమ్మకాలు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్లు కాకపోవడం, మార్కెట్లో పెద్దగా ఆర్థిక లావాదేవీలు లేకపోవడం, నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడం మద్యం అమ్మకాల తగ్గుదలకు మరో కారణమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, గత ఏడాది మద్యం అమ్మకాల ద్వారా రూ.317.23 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం రూ.312.05 కోట్లే సమకూరింది. గతంతో పోలిస్తే.. ఎక్సైజ్ ఆదాయం పెరగక పోగా.. రూ.5.18 కోట్ల మేర ఆదాయం తగ్గడం గమనార్హం. గతంతో పోలిస్తే.. మద్యంప్రియుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఏళ్లుగా మద్యం అలవాటు ఉన్న వాళ్లను ఆరోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో మెజారిటీ మద్యం ప్రియులు లిక్కర్‌కు దూరంగా ఉంటున్నారు.

పది రోజుల్లో మద్యం విక్రయాలు (రూ.కోట్లలో)

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	2023	2024
హైదరాబాద్	80	45.56	38.50
సికింద్రాబాద్	99	38.02	35.87
మేడ్చల్	114	52.69	55.53
మల్కాజిగిరి	88	45.94	45.50
వికారాబాద్	59	15.98	17.25
శంషాబాద్	100	61.31	59.64
సరూర్‌నగర్	134	57.73	60.55

అశ్వ వాహనంపై అనంతుడు



అనంతగిరి: స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. అశ్వవాహన వేడుక ఆలంపల్లి ప్రధాన వీధుల మీదుగా సమీప మైదానం వరకు సాగింది. అక్కడ రావణ దహనం, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తగిరిపేట్‌లో..

తాండూరు రూరల్: మండలంలోని దస్తగిరిపేట్ (చంద్రగిరి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారు అశ్వవాహనంపై విహరించారు. కార్యక్రమంలో ఆయల ధర్మకర్తలు పూరంధరచార్ శుక్రవార్, భక్తులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటిచెప్పడమే ఈ వాహనం పరమార్థమని అర్చకులు తెలిపారు. దేవేరుల సమేత మలయప్పస్వామి అశ్వవాహనంపై పారువేటకు బయలుదేరి బస్టాండ్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో భక్తులతో పూజలు అందుకున్నారు. ఆలయ ఆవరణలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.



తాండూరు రూరల్: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



కొడంగల్: అశ్వవాహనంపై శ్రీవారు

విద్యార్థులకు మళ్లీ రాగి జావ

- వారానికి మూడ్రోజులు అందించాలి
- అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు



సాక్షి, సిటీబ్యూరో: ఉదయం పూట విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ మాసం వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలు (జూలై, ఆగస్టు, సెప్టెంబర్)గా నిలిచిపోయింది. రాగి జావ అందించడంతో మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో దసరా సెలవులు ముగిసిన తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ అందనుంది.

గ్రేటర్ జిల్లాల్లో ఇలా..

హైదరాబాద్ నగరంతో సహా మేడ్చల్– మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 2,497 ప్రభుత్వ పాఠశాలల్లో 3.81లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు.

చర్యలు చేపడతాం

విద్యార్థులకు మళ్లీ రాగి జావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– విజయకుమారి, మేడ్చల్, మల్కాజిగిరి డీఈఓ

కిన్నెర మొగులయ్య ప్లాట్ ప్రహరీ కూల్చివేత

కేసు నమోదు చేసిన పోలీసులు

లింగోజిగూడ: ప్రముఖ జానపద కళాకారుడు కిన్నెర మొగులయ్యకు ప్రభుత్వం హయత్‌నగర్ పరిధిలో స్థలం కేటాయించగా.. అక్కడ ఆయన ప్లాట్ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించుకున్నాడు. అయితే.. గత నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు మొగులయ్య నిర్మించిన పహరీ గోడను ధ్వంసం చేశారు. ఈ విషయంపై ఆయన హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మొగులయ్యతో స్వయంగా మట్లాడి ప్లాట్ కాంపౌండ్ వాల్ పునర్ నిర్మించుకునేందుకు తగిన తోడ్పాటు అందించారు. దీంతో మొగులయ్య గోడను నిర్మించుకున్నాడు. ఈ కేసులో నిందితులను త్వరగా అరెస్టు చేస్తామని హయత్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు.

పత్తితీత.. రైతు వెత

- పత్తితీత సమయంలో వరుణుడి గండం
- వరుసగా కురుస్తున్న వర్షాలతో ఆటంకం
- మరోవైపు వేధిస్తున్న కూలీల కొరత
- జిల్లాలో జాడలేని కొనుగోలు కేంద్రాలు
- గ్రామాల్లో వాలిపోతున్న దళారులు
- అన్నివిధాలా నష్టపోతున్నామని రైతుల ఆందోళన

యాచారం: ఎడతెరిపి లేని వర్షాలు పత్తి రైతుకు కునుకు లేకుండా చేస్తున్నాయి. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిన వారు లాభాలు పొందుతామనే ఆశతో ఉండగా వారి ఆశలపై వరుణుడు నీళ్లు చల్లుతున్నాడు. ఈ వానాకాలం జిల్లాలో 1.75 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేశారు. రెండేళ్లుగా మార్కెట్లో క్వింటాల్‌కు రూ.7 వేలకు పైగా డిమాండ్ ఉండడంతో పంటను సాగు చేసిన రైతులు మంచి లాభాలు గడించారు. అదే ఆశతో ఈ సీజన్‌లోనూ పత్తి సాగువైపు ఆసక్తి చూపారు. మాడ్గుల యాచారం, కందుకూరు, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మంచాల, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో గణనీయంగా సాగు చేశారు. ఒక్క మాడ్గుల మండలంలోనే అత్యధికంగా 80 వేల ఎకరాలకు పైగా సాగైంది. కొన్ని మండలాల్లో వర్షాలు ముందే కురవగా, మరికొన్ని మండలాల్లో ఆలస్యంగా కురిసాయి. ముందు కురిసిన గ్రామాల్లో సాగు చేసిన పత్తి తీతకు రాగా, ఆలస్యంగా సాగు చేసిన గ్రామాల్లో ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. సాగు సమయంలో కొరతతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధర చెల్లించి విత్తనాలు కొనుగోలు చేశారు.

చేతికొచ్చే వేళ.. చేనులోనే నాని

ప్రస్తుతం మాడ్గుల, యాచారం, తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు తదితర మండలాల్లో పత్తిని జోరుగా తీస్తున్నారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి తీత పనులు నిలిచిపోయాయి. జిల్లాలో దాదాపు 50 వేలకు పైగా ఎకరాల్లో పత్తి తీతకు రెడీ అయినప్పటికీ వరుసగా కురుస్తున్న వర్షాలు, కూలీల కొరతతో ఆటంకం ఏర్పడుతోంది. అన్ని గ్రామాల్లో పత్తి తీత పనులు జోరందుకోవడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. కిలో పత్తి తీస్తే రూ.12 చొప్పున, ఇతర గ్రామాల నుంచి వస్తే రవాణా చార్జీలు చెల్లించాలని, పత్తి తీతకు రావాలంటే ప్రతి కూలీకి ముందే రూ.10 వేల అడ్వాన్స్ ఇవ్వాలని కూలీలు షరతులు పెడుతున్నారు. దీంతో రైతులు చేసేది లేక ఏపీలోని కర్నూల్, గుంటూరు, మార్కాపురం, మాచర్ల, శ్రీశైలం తదితర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు. కూలీల కొరత, నానుతున్న పత్తితో భారీగా నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేసేది లేక దళారులకే విక్రయం

పత్తి తీత ప్రారంభమైనప్పటికీ జిల్లాలో కొనుగోలు కేంద్రాల జాడే కనిపించడం లేదు. ఇదే అవకాశంగా దళారులు గ్రామాల్లో వాలిపోతున్నారు. పంటల పొలాల వద్దకే నేరుగా వెళ్లి క్వింటాల్‌కు రూ.4 వేల నుంచి రూ.4,500 వరకే కొనుగోలు చేస్తున్నారు. తూకంలోనూ రైతులను నిండా ముంచుతున్నారు. క్వింటాల్ పత్తి కొనుగోలు చేస్తే కనీసం 5 నుంచి 10 కిలోలకు పైగానే గండికొడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే క్వింటాల్‌కు రూ.7 వేలకు పైగా డిమాండ్ ఉంటుందని రైతులు అంటున్నారు. పత్తితీత పనులు జోరుగా సాగుతున్న మండలాల్లో నిత్యం 5 నుంచి 10 వేల క్వింటాళ్ల పత్తి దళారుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.



మాడ్గుల మండలం కొల్కులపల్లిలో పంటపైనే నానుతున్న పత్తి



యాచారం మండలం నక్కర్తమేడిపల్లిలో ఎండకు ఆరబెట్టిన పత్తి

అప్పు తీర్చేందుకు..



వర్షాలతో చేనులోనే పత్తి నాని మరింత నష్టపోతామని భయంగా ఉంది. పది రోజుల క్రితం 20 క్వింటాళ్ల పత్తిని తీసి గ్రామానికి వచ్చిన దళారులకే క్వింటాల్‌కు రూ.4,500 చొప్పున విక్రయించాను.ఈ ఏడాది రైతు బంధు రాకపోవడంతో 5 ఎకరాల్లో రూ.లక్షకు పైగా అప్పు తెచ్చి పెట్టు బడులు పెట్టాను.అప్పు తీర్చడం కోసం వెంటనే దళారులకు విక్రయించాను.

– చిందం కృష్ణ, రైతు, నక్కర్తమేడిపల్లి

కర్నూల్ నుంచి కూలీలు



50 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. స్థానికంగా కూలీల డిమాండ్ ఉంది. ఏపీలోని కర్నూల్ ప్రాంతం నుంచి 50 మంది కూలీలను రప్పిస్తున్నాను. పొలం వద్దే ఉంటూ నిత్యం ఒక్కో కూలీ రెండు క్వింటాళ్లకు పైగా పత్తిని తీస్తున్నారు. డబ్బు ఖర్చయినా కూలీల ఇబ్బంది ఉండదు. కురుస్తున్న వర్షాలతో పత్తి పూర్తిగా నష్టపోయింది.

– బత్తుల కొండల్‌రెడ్డి, రైతు, మాడ్గుల

ఆగి ఉన్న కారును ఢీ కొని..


ప్రమాదానికి గురైన ఆటో


వెంకటయ్య మృతదేహం

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

నందిగామ: ఆగిఉన్న కారును వెనకాల నుంచి వచ్చిన ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన ఘటన నందిగామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ రవిబాబు మంచినీరు తాగేందుకు నందిగామ శివారులో రోడ్డు పక్కన కారును నిలిపాడు. అదే సమయంలో నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన వెంకటయ్య(45) అతడి భార్య రాధికతో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు ఆటోలో హైదరాబాద్ వైపు వెళ్తు వెనకాల నుంచి కారును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి పంపించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సిఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలిస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదిబట్ల టీసీఎస్‌నుంచి ద్వీచక్ర వాహనంపై ద్యానిసింగ్, పెరుమల్ల హరీశ్, ప్రకాశ్ అనే ముగ్గురు వ్యక్తులు బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి వస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒకే వాహనంపై అతివేగంగా వచ్చి బొంగ్లూర్ సర్వీస్‌రోడ్డు సమీపంలోని శ్రీరామధర్మకాంట వద్ద నాలాలో పడిపోయారు. ఈ సంఘటనలో బిహార్‌కు చెందిన ద్యాన్ సింగ్ (40), పెరుమల్ల హరీశ్ (28) నిర్మల్ ఖానాపూర్‌కు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. బెంగాల్‌కు చెందిన ప్రకాశ్ (30)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైయివేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పోలీసులు పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలు

బంధువుల ఇంటికొచ్చి మహిళ బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: బంధువుల ఇంటికొచ్చిన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మునుగోడు మండలం లక్ష్మీదేవిగూడెంకు చెందిన వివాహిత కప్పెర సాలమ్మ(30) ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్ గ్రామ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నివసించే బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా పది రోజుల క్రితం వచ్చినట్లు తెలిపారు. శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఖానాపూర్ గ్రామ సమీపంలోని వేప చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయంలో పోలీసులు ఆమె బంధువులను విచారించినట్లు పేర్కొన్నారు. ఆమె మానసిక ప్రవర్తన సరిగాలేదని, మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని సీఐ సత్యనారాయణకు మృతురాలి బంధువులు చెప్పారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వావి వరుసలు మరిచి..

షాబాద్: వావి వరుసలు మరిచిన ఓ కామాంధుడు కన్న కూతురిపైనే అత్యాచారం చేసిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయింది. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు ఓ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతోంది. భార్య లేకపోవడంతో కూతురిని భయపెట్టి అత్యాచారం చేయసాగాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి దసరా పండుగ కావడంతో అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కూతురిపై అత్యాచార యత్నం చేస్తుండగా కుమారుడు చూసి స్థానికుల సాయంతో 100కు డయల్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

మొయినాబాద్: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చందానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే బాబుజాన్ కుటుంబ సమస్యలతో తరచూ భార్య రిజ్వానతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి బాబుజాన్ రోజుమాదిరిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఆయన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో వీపులో పొడిచి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న చుట్టు పక్కలవారు వచ్చి విడిపించి పోలీసులకు సమాచారం చేరవేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన రిజ్వానాను చికిత్సకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలిస్ స్టేషన్‌పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన నర్ర శివారెడ్డి (29), వ్యక్తి తల్లిదండ్రులు బొంగ్లూర్ సమీపంలోని మెట్రోసిటీ కాలనీలో నివసిస్తున్నారు. పండుగ సందర్భంగా వారిని చూసేందుకు స్కూటీపై వెళ్లి తిరిగి వస్తుండగా బొంగ్లూర్ సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని శివారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి చక్రతీర్థ సేవ

మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు, దసరా రోజు స్వామి వారికి చక్రతీర్థ సేవ (తెప్పోత్సవం)తో ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు గరుడవాహన సేవ, పండుగ రోజున చక్రతీర్థ సేవ తెప్పోత్సవం, రాత్రి అశ్వవాహన సేవలతో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు ఆలయ పుష్కరిణి వద్ద స్వామి వారికి చక్రతీర్థ సేవలతో ఊరేగించారు. ఈ సేవను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. - చేవెళ్ల


చక్రతీర్థ సేవను చూసేందుకు వచ్చిన ప్రజలు


బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పుష్కరిణిలో పూజలు


పుష్కరిణిలో స్వామివారికి చక్రతీర్థ సేవ

విద్యుత్ తీగలు చోరీ

కాపలాదారుడు శ్రావణ్ కుమార్ ఫిర్యాదు

నందిగామ: పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో 17 స్తంభాలకు చెందిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఘటన నందిగామలో చోటు చేసుకుంది. స్థానికులు, వెంచర్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామ సమీపంలో వీర్లపల్లికి వెళ్లే దారిలో వేణుగోపాల్ నగర్ వెంచర్ ఉంది. ఆ వెంచర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి 17 స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లను కోసుకొని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం కాపాలదారుడు శ్రావణ్ కుమార్ విషయాన్ని గుర్తించాడు. విద్యుత్ వైర్ల విలువ సుమారు రూ. లక్షల్లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇద్దరు దుండగులు విద్యుత్ వైర్లను కట్ చేసేందుకు వచ్చినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సీసీ ఫుటేజీలో నిందితుల చిత్రాలు

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

కడ్తాల్: మండల కేంద్రంలో బిహార్ రాష్ట్రానికి చెందిన గుడియా ముకేశ్ దంపతులు కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం గుడియాకు పురిటి నొప్పులు అధికం కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్ కడ్తాల్‌కు చేరుకుని గుడియాను ఆస్పత్రికి తరలించేక్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమవ్వడంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే నార్మల్ డెలివరి చేశారు. దీంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పేర్కొన్నారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం కందుకూర్ ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు.


పుట్టిన బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వైద్య సిబ్బంది

యువతి అదృశ్యం

షాబాద్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన షాబాద్ మండలంలోని పెద్ద సోలీపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద సోలీపేట్ గ్రామానికి చెందిన మహమ్మద్ నయిమ్ కూతురు ఫారియాల్ బేగం ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. ఆమెకోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఏండీ షెక్ జవార్ అనే వ్యక్తిపై తనకు అనుమానం ఉందని యువతి తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు.

తల్లి మరణించిందని మనస్తాపంతో...

మొయినాబాద్: మూడు నెలల క్రితం తల్లి మరణించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ముర్తూజగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన కావలి కొమరయ్య కుటుంబం పదిహేనేళ్ల క్రితం మొయినాబాద్ మండలంలోని ముర్తూజగూడకు వచ్చి అక్కడే నివాసముంటున్నారు. కొడుకు సాయికుమార్(24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం కొమరయ్య భార్య నాగమ్మ మరణించింది. తల్లి మరణించిందని సాయికుమార్ మనస్తాపానికి గురై శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో చీరతో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


సాయికుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంచాల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంచాల మండల పరిధిలోని రంగాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మంచాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి (భువనగిరి)జిల్లా నారాయణపూర్ మండలం కొర్ర తండా గ్రామానికి చెందిన కొర్ర రవీందర్ నాయక్(38) మంచాల మండలంలోని కొర్రవాని తండాలో బంధువుల ఇంటికి వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. రంగాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ డీజైర్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కొర్ర రవీందర్‌కు తలకు బలమైన గాయం కావడమే గాక కాళ్లు విరిగాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతన్ని ఇబ్రహీంపట్నంలోని ఓప్రైవేట్ వైద్య శాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రాణం తీసిన కుటుంబ తగాదాలు

భార్యను హత్య చేసిన భర్త

చైతన్యపురి: భార్యా భర్తల మధ్య చోటుచేసుకున్న గొడవ హత్యకు దారితీసింది. ఆవేశానికి లోనైన భర్త కత్తితో పొడిచి భార్యను చంపిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు...ప్రకాశం జిల్లాకు చెందిన గంజి వెంకటేష్, గంజి సోను (32) దంపతులు ఇద్దరు పిల్లలతో నగరానికి వచ్చి గడ్డిఅన్నారం సరస్వతీనగర్ కాలనీలో నివసిస్తున్నారు. వెంకటేష్ కూలిపని చేస్తుండగా సోను ఇళ్లలో పనిచేస్తుంది. వీరికి గోవిందరాజు (14), మురళీ కృష్ణ (11) ఇద్దరు కుమారులున్నారు. గత మూడేళ్లగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం సోను పంజాబీ డ్రస్ వేసుకోగా వెంకటేష్‌కు నచ్చలేదు. వద్దని వారించినా వినకపోవటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ దశలో వెంకటేశ్ ఆవేశంగా కూరగాయలు కోసే చాకు తీసుకుని భార్యను కడుపులో, వీపుపై పొడిచాడు. దీంతో సోను రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్యపై దాడి చేసే సమయంలో వెంకటేష్ చేతికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

బైక్‌లతో భయానక స్టంట్లు

పది బైక్‌లు సీజ్..
పది మందిపై కేసు నమోదు

గచ్చిబౌలి: బైక్‌లతో యువకులు భయానక స్టంట్లు చేస్తూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ పరిసరాల్లో ప్రధాన రోడ్లపై అర్ధరాత్రి వరకు రేసింగ్‌కు పాల్పడుతూ భయానక వాతావరణం సృష్టిస్తూ ప్రయాణికులకు ఇక్కట్లు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు పది బైక్‌లను సీజ్ చేసి, పది మంది యువకులపై కేసు నమోదు చేశారు. ఆదివారం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన యువకులు పది బైక్‌లపై వచ్చి నాలెడ్జి సిటీ ప్రధాన రోడ్లపై స్టంట్లు సృష్టిస్తూ మితిమీరిన వేగంతో రేసింగ్‌కు పాల్పడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పది బైక్‌లను అదుపులోకి తీసుకొని వాటిని సీజ్ చేశారు. పది మంది యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పండుగపూట విషాదం

పెద్దేముల్: పండుగ పూట ఓ రైతు ఇంట్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ద కుర్వ బాలప్ప(45), అడవి పందుల బెడదతో తన మొక్కజొన్న పంట కాపాలాకు వెళ్లాడు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రోడ్డుకు పక్కనే నిద్రించాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కనే వ్యక్తి పడుకున్నది గమనించని గుర్తు తెలియని వాహన దారుడు.. సదరు రైతును ఢీకొట్టడంతో బాలప్ప తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలప్ప మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భార్యతో గొడవపడి..

ఇంట్లో ఉరేసుకున్న భర్త

యాచారం: భార్యతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన గంగనమోని జంగయ్య, జంగమ్మ కుమారుడు గంగనమోని నాగేష్(26) రెండు నెలల క్రితం నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన నిహారికతో వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లేదు. పండు గ సందర్భంగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో దసరా రోజు శనివారం రాత్రి పది గంటల వరకు ఉత్సవాల్లో తన స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపాడు. రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చి ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం నాగేష్ నిద్రలేవకపోవడంతో తల్లితండ్రులు తలుపు కొట్టి చూడగా ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.


నాగేష్ (ఫైల్)

నకిలీ నిత్యావసరాల దందా

ప్రముఖ కంపెనీల పేర్లతో ఉత్పత్తులు

- రెండు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- భారీ స్థాయిలో నాసిరకం నరుకు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కంపెనీలు, బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ నిత్యావసర వస్తువుల్ని విక్రయిస్తున్న మూడు దుకాణాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యాపారులను పట్టుకోవడంతో పాటు భారీగా నకిలీ, నాసిరకం ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుదీంద్ర ఆదివారం వెల్లడించారు. రాజస్థాన్ నుంచి వచ్చి గోషామహల్‌లో స్థిరపడిన రమేష్ కుమార్ పర్మర్ బేగంబజార్‌లో ఆర్‌ఎం జనరల్ స్టోర్ పేరుతో, హితేష్ పర్మర్ ఫీల్‌ఖానాలో సరోజ్ ఏజెన్సీ పేరుతో, ఎర్రగడ్డలో స్థిరపడిన రమేష్ కుమార్ శ్రీ ట్రేడర్స్ పేరుతో నిత్యావసర వస్తువుల విక్రయ వ్యాపారం చేస్తున్నారు. ఇందులో ఆశించిన లాభాలు లేకపోవడంతో తక్కువ కాలంలో భారీ లాభాలు పొందడానికి మార్గాలు అన్వేషించారు. ఇందులో భాగంగా ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు తయారు చేసి విక్రయించే ఏజెంట్లను సంప్రదించారు. వారి నుంచి గుడ్‌నైట్ లిక్విడ్, గోల్డ్‌ఫ్లాష్ కాంబి ప్యాక్, లైజాల్ లిక్విడ్, ఫెవీ క్విక్ పేర్లు, ప్యాకింగ్‌తో ఉన్న నకిలీ ఉత్పత్తులు అతి తక్కువ రేటుకు ఖరీదు చేస్తున్నారు. వీటిని తమ దుకాణాల్లో ఉంచి అసలైనవే అని వినియోగదారులకు చెప్తూ హోల్‌సేల్, రిటైల్‌గా అమ్ముతున్నారు. ఈ బ్రాండ్లపై ఉన్న నమ్మకంతో కస్టమర్లు సైతం భారీగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ముగ్గురి దందాపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్‌తో కూడిన బృందం మూడు ప్రాంతాల్లో దాడి చేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి 444 బాక్సుల గోల్డ్ ఫ్లాష్ కాంబి ప్యాక్, 94 బాక్సుల గుడ్‌నైట్ లిక్విడ్, 702 లైజాల్ బాటిల్స్, 13440 ఫెవీక్విక్ సాచెట్స్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ ముగ్గురితో పాటు స్వాధీనం చేసుకున్న నకిలీ సరుకును బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

మద్యం మత్తులో మహిళ హల్‌చల్

ఫిలింనగర్: మద్యం మత్తులో ఓ మహిళ (44) పార్కు పక్కన తూలిపోతూ..రోడ్డు పక్కన పడుకుని న్యూసెన్స్ చేస్తుండగా సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని సయ్యద్‌నగర్ బస్తీలో నివసించే ఓ మహిళ గత కొంతకాలంగా మద్యానికి బానిసై అర్ధరాత్రి దాకా రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తుంది. శుక్రవారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రాంతంలో మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తుండగా బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడకు వెళ్లి ఆమె ఇంట్లో అప్పగించి వచ్చారు. అయితే ఇంట్లో చెప్పకుండానే ఆమె మళ్లీ అదే అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో బయటకు వచ్చింది. ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని లోటస్ పాండ్ పార్కు వద్ద వివస్త్రగా పడి ఉంది. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమె గురించి ఆరా తీయగా సయ్యద్‌నగర్‌లో నివసిస్తుందని తెలిసింది. దీంతో ఆమె కూతురికి ఫోన్ చేయగా 'సార్..దయచేసి మా అమ్మను ఇంటికి పంపకండి..జైలుకు పంపండి..' అంటూ ఆమె ఇంట్లో చేసిన న్యూసెన్స్‌ను మొరపెట్టుకుంది. ఆమె భర్త పెయింటర్‌గా పనిచేస్తుంటాడని, ముగ్గురు పిల్లలు ఉన్నారని, మద్యానికి బానిసైనట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల రోజుల నుంచి 10 మార్లు పోలీసులు ఆమెను ఇలాగే రోడ్లపై మద్యం మత్తులో తిరుగుతుండగా కుటుం బసభ్యులకు అప్పగించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.